క్లుప్తంగా

పెస్టిసైడ్ దుకాణాల తనిఖీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో గల పెస్టిసైడ్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రజాపతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. దుకాణదారులు ప్రతి షాపులో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ అప్డేట్‌గా ఉండాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులను అందజేయాలన్నారు.

ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా అల్లం మహేందర్ కుమార్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తహసీల్దార్‌గా అల్లం మహేందర్ కుమార్ శుక్రవారం బదిలీపై వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా విధులను నిర్వర్తించిన మహేందర్ కుమార్, ఎల్లారెడ్డికి బదిలీపై వచ్చి బాధ్యతలను స్వీకరించినట్లు వారు తెలిపారు.

ఫిజియోథెరపి క్యాంప్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 9 మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్చాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): బడి బయట పిల్లలను బడిలో చేర్చాలని శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఆర్పీ సంజీవ్ కుమార్ పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుకునే వయస్సులో పనిలో పెట్టడం నేరమని వారికి చెప్పారు.

బాల కార్మికులు లేకుండా చూడండి



కామారెడ్డి క్రైం: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాల కార్మిక చట్టాలు, బాలల రక్షణ, హక్కులపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీవో స్రవంతి మాట్లాడుతూ.. బడి బయట పల్లలు లేకుండా చూడాలని కోరారు. బాల కార్మికులు గానీ, చెత్త ఏరుకునే పిల్లలు గానీ, భిక్షాటన చేస్తూ గానీ, వీధి బాలలు గానీ ఎక్కడైనా కనిపిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే ఎస్సై తావూ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో వివిధ రంగాల గుర్తింపు పొందిన కార్మికుల సంక్షేమం కింద వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించడానికి ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులు కోరుతున్నట్లు రాష్ట్ర సంక్షేమాధికారి సి.గంగాధర్ తెలిపారు. 2022–23 సంవత్సరంలో పదవ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ, బీసీఏ, ఎంసీఏ, ఫార్మసీ, బీబీఏ, ల్యాబ్ టెక్నీషియన్ తదితర కోర్సులు పాసైన వారు దరఖాస్తు చేయాలని, మార్కుల ఆధారంగా వెయ్యి నుంచి 2 వేల వరకు స్కాలర్‌షిప్ మంజూరు చేస్తారని వివరించారు. వివరాలకు కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీకి సిగ్నల్ సమస్య

- డబ్బుల కోసం లబ్ధిదారుల పడిగాపులు
- పట్టించుకోని అధికారులు



నర్వలో ఆసరా పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

నిజాంసాగర్(జుక్కల్): ఆసరా పింఛన్ డబ్బుల పంపిణీకి ఇంటర్‌నెట్ సిగ్నల్ సమస్యతో లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు అందడం లేదు. దీంతో లబ్ధిదారులు పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లాలో 1.72 లక్షల మందికి నెలనెలా వివిధ రకాల పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పింఛన్ల పంపిణీ ప్రక్రియను పోస్టాఫీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బయోమెట్రిక్ యంత్రాల ద్వారా పింఛన్ల పంపిణీ సజావుగా సాగుతున్నా ఇంటర్‌నెట్ సమస్య తలనొప్పిగా మారింది. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పిట్లం, పెద్దకొడప్‌గల్, డొంగ్లి మండలాల్లోని మారుమూల గ్రామాల్లో ఇంటర్‌నెట్ సమస్య నెలకొంది. మారుమూల గ్రామాల్లో సెల్‌టవర్ సిగ్నల్స్ అందకపోవడంతో పింఛన్ల పంపిణీకి ఆటంకం కల్గుతోంది. సంబంధిత శాఖాధికారులు ఇకనైనా స్పందించి బయోమెట్రిక్‌కు ఇంటర్‌నెట్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మల్లన్న జాతరకు సర్వం సిద్ధం



ముస్తాబైన మల్లన్న ఆలయం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ శివారులోని దేవునిపల్లి మల్లన్న జాతర ఈ నెల 6 నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. నవచైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. ఈ ఉత్సవాలకు జిల్లాలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వీడీసీ ప్రతినిధులు భోజన్నగారి రాజు పాటిల్, నాగల్ల స్వామి కోరారు.

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో భుజంగరావు

బాన్సువాడ: ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీవో భుజంగరావు అన్నారు. శుక్రవారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో బాన్సువాడ మున్సిపాలిటీ, మండలం, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లకు ఆన్‌లైన్ విధానం గురించి అవగాహన కల్పించారు. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులో ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సంక్రాంతిలోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులున్నారు.

ఇసుక తవ్వకాలపై విచారణ

- ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలతో విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

బాన్సువాడ : బీర్కూర్ మంజీర ప్రాంతంలో చెక్‌డ్యాం పేరిట అక్రమంగా చేపట్టిన ఇసుక తవ్వకాలపై శుక్రవారం గనులు, భూగర్భ, రెవిన్యూ శాఖల అధికారులు విచారణ చేశారు. చెక్‌డ్యాం పేరిట పదేళ్లుగా అక్రమంగా ఇసుక రవాణా జరిగిందని ఆరోపిస్తూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గనులు, భూగర్భ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పదేళ్లుగా బీర్కూర్ మంజీర ప్రాంతం నుంచి ఇసుక ఏ మేరకు రవాణా చేశారో సమగ్ర నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. దీంతో బీర్కూర్, బరంగేడ్గి, దామరంచ శివారుల్లో విచారణ చేపట్టారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఆర్డీవో భుజంగరావు, గనులు, భూగర్భ శాఖ ఏడీలు కాంత్రికుమార్, సతీష్, ల్యాండ్ సర్వేయర్ ఏడీ శ్రీనివాస్, సర్వేయర్ అనీల్ తదితరులున్నారు.

ఘనంగా భారత్ స్వాభిమాన్ దినోత్సవం



ధ్యానం చేస్తున్న యోగా అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: స్వదేశీ ఉత్పత్తుల వాడకంలో భారత్ స్వాభిమాన్ చేసిన కృషి ఫలితంగా భారత దేశం స్వయంసమృద్ధి దిశగా అభివృద్ధి చెందుతుందని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రభారి గడ్డం రాంరెడ్డి అన్నారు. భారత్ స్వాభిమాన్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక యోగా జిల్లా భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తులు, బాబా రాందేవ్ చేసిన కృషిని వివరించారు. యోగా, ప్రకృతి వ్యవసాయం, ఆయుర్వేదం, స్వదేశీ వస్తువుల తయారీ, పరిశోధనల్లో యువత ముందుండాలన్నారు. యోగా గురువులు గరపల్లి అంజయ్య, పెట్టిగాడి అంజయ్య, అంతిరెడ్డి, రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండుగ



పూజలో పాల్గొన్న నర్వ గ్రామస్తులు



లింగంపేటలో అయ్యప్ప స్వాముల శోభాయాత్ర



సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో శుక్రవారం దుర్గమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సర్పంచ్ గొర్గంటి సంగమణి, గ్రామ పెద్దలు రాములు, నర్సింలు, తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆరట్టు మహోత్సవం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్పస్వాముల ఆరట్టు మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే శోభాయాత్ర చేశారు. అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులు చంద్రమౌళి, రవిగౌడ్, రాజిరెడ్డి, పోతన్‌గౌడ్, మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధి, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

సరస్వతి ఆలయంలో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రొండ్ల నారాయణరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం మున్నూరు కాపు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై నర్సింలు ప్రారంభించారు. ఆకుల సాయికుమార్, కొట్టం సంతోష్‌ల స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అవారి గంగారం, సానెపు గంగారం, మ్యాకల విఠల్ తదితరులు ఉన్నారు.

రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని పలు కాలనీలలో రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపి వేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో మెయిన్ పైప్‌లైన్ లీకేజీ పనులను ఆయన పరిశీలించారు. మరమ్మతులకు రెండు రోజుల సమయం పడుతుందన్నారు. దీని వల్ల పట్టణంలోని ఇందిరానగర్, గాంధీనగర్, బీసీ కాలనీ, గాంధీచౌక్ ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపి వేసినట్లు వివరించారు.

ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలకు డిమాండ్



కామారెడ్డి టౌన్: విద్యార్థులను చదువుల పేరిట స్థాయికి మించి రోజంతా ఒత్తిళ్లకు గురి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు చదువులతో విద్యార్థులను తీవ్రంగా మానసికంగా ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని వివరించారు. తక్షణమే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ పట్టణ కన్వీనర్ సంజయ్, నాయకులు భాను, యశ్వంత్, ఆదర్శ్ తదితరులున్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి లక్షా 55 వేల 270 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జపాన్‌లో ఉన్నత విద్యకు చేయూత

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి



భూమిపూజ చేస్తున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో రసాయన శాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులకు జపాన్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు చేయూత అందిస్తానని శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన సౌత్ క్యాంపస్‌లో పైడి ఎల్లారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించనున్న ఓపెన్ డయాస్ నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఈ ప్రాంతానికి చెందినవాడినని, ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. సౌత్‌క్యాంపస్‌లో ఓపెన్ డయాస్ లేకపోవడం తెలుసుకుని తాను నిర్మాణానికి ముందుకు వచ్చానన్నారు. జపాన్‌లోని విశ్వవిద్యాలయాల్లో తనకు తెలిసిన వారు చాలా మంది ఉన్నారని విద్యార్థులు జపాన్ వెళ్లేందుకు ఆసక్తి కనబరిస్తే వారికి అన్ని విధాలా సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేపల చెరువుల పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

బాన్సువాడ: బీర్కూర్ మండలంలో ఏర్పాటు చేసిన చేపల చెరువులను శుక్రవారం డీఆర్‌డీవో సాయన్న పరిశీలించారు. చేపల పెంపకంపై లబ్ధిదారులు సోము పద్మ, సంజీవ్‌లను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ చుట్టూ తీగ జాతి కురగాయలు పెంచాలని, చేపల ఎదుగుదలపై ఆరా తీశారు. క్రాప్ వివరాలు, ఫీడ్ గురించి అడిగారు. అనంతరం బీర్కూర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫిష్ యూనిట్‌ను పరిశీలించారు. ఫిష్ యూనిట్లు ఎక్కువ మంది లబ్ధిదారులు వినియోగించుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏపీఎం గంగాధర్, ఏపీవో అక్మాల్, సురేష్, సీసీలు మహేందర్, నాగలక్ష్మి తదితరులున్నారు.

ప్రతి పథకం అమలు చేయడానికే ప్రజాపాలన

- కాంగ్రెస్ నేత ఏనుగు రవీందర్ రెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న రవీందర్ రెడ్డి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): రాష్ట్రంలో ప్రతి పథకం అమలు చేయడానికే ప్రజాపాలన కార్యక్రమం చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంకోల్ క్యాంపు, కామిశెట్టి గ్రామంలో జరిగే ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముచ్చటించి ఆరు గ్యారెంటీల అమలుకు సీఎం రేవంతర్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. తహసీల్దార్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు నందు రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటరమణ, నాయకులు శివప్రసాద్, శాంతయ్య, తదితరులున్నారు.

సామాజిక కార్యకర్తలుగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సోషల్ వర్క్ విభాగపు విద్యార్థులు అంధుల కార్యక్రమాల్లో పాల్గొని సేవలు అందించడం ప్రశంసనీయమని ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సోషల్ వర్క్ విద్యార్థులు నైపుణ్య సామాజిక కార్యకర్తలుగా ఎదగాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.సోషల్ వర్క్ విభాగం అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్, అధ్యాపకులు రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అక్షింతల పంపిణీ



మద్నూర్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న హిందూ సంఘాల నేతలు



దేవునిపల్లి విద్యుత్‌నగర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అయోధ్య రాములోరి అక్షింతలతో కూడిన కలశాలకు ఊరేగింపు నిర్వహిస్తున్నారు. భక్తుల జైశ్రీరామ్ నినాదాలతో వీధులు మార్మోగాయి. అనంతరం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేస్తున్నారు. ఊరేగింపులో హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, స్థానిక గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



భిక్కనూరు: అక్షింతల కలశాలతో రామభక్తులు



మాల్తుమ్మెదలో అక్షింతల కలశాన్ని పల్లకీలో ఉంచి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి



నిజాంసాగర్(జుక్కల్): గ్రామాల వారీగా చేపడుతున్న అభయాస్తం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నాగేశ్వర్ సూచించారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో అభయాస్తం ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్తరేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు, రైతు బంధు, గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. సర్పంచ్ గంగి సునీత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు రమేష్ యాదవ్, ఆకాష్ తదితరులున్నారు.